PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 192 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 08 జులై 2026

**పశు వైద్యశాలలో వైద్యుల కొరత**



3లో

**ఇళ్ల మధ్యే లూజ్ గ్యాస్ ఫిల్లింగ్**



3లో

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

**రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు**

**పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్**

**సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం**

**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**



**హైదరాబాద్, 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయ పడ్డారు. మిగతాది 2లో...



# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

**182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం**

**సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం -కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం మిగతాది 2లో...





# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. మిగతా 2లో...



# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు**

**నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**రంగారెడ్డి,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మిగతాది 2లో...





# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

**న్యూఢిల్లీ,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. మిగతాది 2లో...

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

**ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన**

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**

**న్యూఢిల్లీ,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే మిగతాది 2లో...





# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**



**అమరావతి,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మిగతాది 2లో...



# భోగాపురం సిద్ధం..

**విమానాశ్రయం త్వరలో ప్రారంభం**

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**అమరావతి,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో మిగతాది 2లో...

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ**

**బీఎల్‌ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు**

**తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు**



2లో.

# భోగాపురం సిద్ధం..

(మొదటి పేజి తరువాయి)

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

(మొదటి పేజి తరువాయి)

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**హైదరాబాద్,జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

(మొదటి పేజి తరువాయి)

తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజి తరువాయి)

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

(మొదటి పేజి తరువాయి)

వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ పక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

(మొదటి పేజి తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ. 85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మిరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

(మొదటి పేజి తరువాయి)

లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వు ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వు ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

## ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



**న్యూ ఢిల్లీ, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# పశు వైద్యశాలలో వైద్యుల కొరత

**● డాక్టర్ లేక ఇబ్బందులు పడుతున్న పశువుల యజమానులు ● వైద్య సేవలపై దృష్టి సారించాలని కోరుతున్న రైతులు**




**కల్లూరు, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రెవెన్యూ డివిజన్ కేంద్రంలో పశువైద్యశాలలో వైద్యాధికారి లేకపోవడంతో పశువుల యజమానులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన పశువైద్యాధికారి డాక్టర్ మమత ఇటీవల చెన్నూరుకు బదిలీ కావడంతో కల్లూరు పశువైద్యశాలలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి బాధ్యతలతో సేవలు కొనసాగుతున్నప్పటికీ శాశ్వత వైద్యాధికారి లేకపోవడం వల్ల రైతులకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీ కేంద్రంతో పాటు మండలంలోని చిన్నకోరుకొండి, పెద్ద కోరుకొండి,యర్రబోయినపల్లి, చంద్రుపట్ల,పేరువంచ, కొర్లగూడెం గ్రామాల పశువైద్యశాలల్లో వెటర్నరీ అసిస్టెంట్లు, అటెండర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా పలు చోట్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో సేవలపై ప్రభావం పడుతోంది. కొన్ని కేంద్రాల్లో వెటర్నరీ అసిస్టెంట్ లేకపోవడంతో అటెండర్లే బాధ్యతలు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అత్యవసర సమయంలో పశువులకు సరైన చికిత్స అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పశుసంవర్ధక శాఖ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 13 మంది గోపాలమిత్రులను నియమించినప్పటికీ వారు ప్రాథమిక సేవలు మాత్రమే అందించగలరని, క్లిష్ట పరిస్థితుల్లో తప్పనిసరిగా పశు వైద్యాధికారి అవసరమని రైతులు చెబుతున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్యాధికారి లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉండగా పశువైద్యశాలల పనివేళల అమలుపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కేంద్రాల్లో మధ్యాహ్నం 12 గంటలకే ఆసుపత్రులు మూసివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సమయపాలన పాటించకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని చెబుతున్నారు.కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్లు, అటెండర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయడంతో పాటు, విధుల నిర్వహణపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి రైతులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఇళ్ల మధ్యే లూజ్ గ్యాస్ ఫిల్లింగ్

**అక్రమ మద్యం విక్రయాలు..!**

**సబ్ కలెక్టర్ కార్యాలయానికి కోతవేటు దూరంలోనే యథేచ్ఛగా దందా**

**నిత్యం భయాందోళనలో స్థానికులు అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు**





**కల్లూరు, జులై 7 (పీసీడబ్ల్యూ న్యూస్):** కల్లూరు పట్టణంలోని ఎన్ఎస్పీ ప్రాంతంలో కొందరు కిరాణా దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా లూజ్ గ్యాస్ విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదే ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్య ప్రమాదకరమైన గ్యాస్ నిల్వలు, విక్రయాలు కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లు లేదా ఇతర పాత్రల్లోకి గ్యాస్ నింపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ప్రక్రియ భద్రతా ప్రమాణాలకు పూర్తిగా విరుద్ధమని, స్వల్ప నిర్లక్ష్యంతోనే భారీ అగ్నిప్రమాదం లేదా పేలుడు సంభవించే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ దుకాణాల చుట్టూ ఇళ్లు, చిన్నపిల్లలు, వృద్ధులు అధికంగా నివసిస్తుండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని అంటున్నారు. చాపల లోడుతో వస్తున్న లారీలు ఇక్కడ గ్యాస్ ఫీలింగ్ చేసుకోవడంతో ఐస్ వాటర్ కారి బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్‌తో పాటు, అక్రమంగా బెల్ట్ షాపులు ద్వారా మద్యం విక్రయాలు కూడా బహిరంగంగానే ఇళ్ల మధ్య కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో యువతపై ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని వాపోతున్నారు. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే సబ్ కలెక్టర్ కార్యాలయం ఉండగా కూడా ఇలాంటి అక్రమ వ్యాపారాలు నిర్భయంగా కొనసాగుతున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన శాఖల కళ్ల ముందే నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యాపారం సాగుతున్నా, ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లైస్ శాఖ, ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తున్నారా..? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా...? అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయా..? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ నిల్వలు, విక్రయాలు లేదా అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత దుకాణాల లైసెన్సులను రద్దు చేసి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నివాస ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదకర కార్యకలాపాలు పునరావృతం కాకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. ఎన్ఎస్పీ ప్రాంతంలో తక్షణ ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. అక్రమ లూజ్ గ్యాస్ విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే వ్యాపారాలపై శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతుంది.

# అంగరంగ వైభవంగా శ్రీ పంచముఖి, శ్రీ రామ సాయి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

**అశేష సంఖ్యలోతరలివచ్చిన భక్తులు.. కన్నుల పండుగగా పూజా, హోమ కార్యక్రమాలు..**

**వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మేయర్ కోలగాని శ్రీనివాస్...**



**కరీంనగర్ టౌన్ జూలై 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్, అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయ16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రోజున అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి , శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే విశేష పూజా కార్యక్రమాలు ప్రత్యేక హోమం, అభిషేకాలను. శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు మేయర్ కోలగాని శ్రీనివాస్ హాజరై, . ఆలయంలోని దైవ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ బాధ్యులు మేయర్ కోలగాని శ్రీనివాస్ ను సత్కరించారు. వేద పండితులు మేయర్ శ్రీనివాస్ కు ఆశీర్వచనం అందించారు. అలాగే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ కుంట రాజేందర్, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్ ను ఆలయ కమిటీ సన్మానించింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిట కిటలాడింది. భక్తుల ందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకు ండా ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక శోభతో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల రాజయ్య, సల్ల మల్లేశం , సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం, బండి కుమార్ , బూట్ల కరుణాకర్ , కొట్టాల శ్రీనివాస్ , చిందం అంజి, చిందం మనోహర్ ,మధు, కొత్తూరీ శ్రీనివాస్ , సిద్దయ్య లతోపాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

**● షాపులు సీజ్‌కూ వెనుకాడం ● నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు, కేసులు నమోదు ● వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి హెచ్చరిక**



**కల్లూరు, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని కల్లూరు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి హెచ్చరించారు. పరిశుభ్రతను విస్మరించి రోడ్లపై చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు పడేస్తున్న వ్యాపారులు, హోటల్ యజమానులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన రహదారిని పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ, కొందరు షాపుల నుంచి వచ్చే చెత్తను నేరుగా రోడ్లపై పడేయడంతో పట్టణ పరిశుభ్రత దెబ్బతింటోందని అన్నారు. దీనివల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు.ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయడం మున్సిపల్ చట్టాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడిన వారికి వెంటనే జరిమానా విధిస్తామని, అదే తప్పు మళ్లీ చేస్తే భారీ జరిమానాతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే వ్యాపార సంస్థల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు షాపులను సీజ్ చేసే చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.కొత్తగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఇళ్లలోనూ, వ్యాపార సంస్థల్లోనూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.పరిశుభ్రత ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆయన, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై రాజీలేని చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన కల్లూరు నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## ఈఎఫ్‌ల డిజిటైజేషన్ పనులను పరిశీలించిన సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్



**కల్లూరు, జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్)** : కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో విజ్ఞాన్ స్కూల్ రోడ్డులో ఉన్న పోలింగ్ స్టేషన్ నెం. 105, 102 లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎన్యూమరేషన్ ఫార్మ్స్ డిజిటైజేషన్ పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిజిటైజేషన్ పురోగతి, నమోదు ప్రక్రియ, వివరాల ఖచ్చితత్వాన్ని పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఫారమ్‌ను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## 49వ డివిజన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ఫారమ్‌లను అందజేయాలి

**- కార్పొరేటర్ ఏన్నంలక్ష్మీ ప్రకాష్**



**కరీంనగర్ టౌన్ జూలై 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ .. ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా, ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ప్రజలను కోరారు. బి ఎల్ ఓ ల ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఓటర్లు ఈ క్రింది విధంగా పూర్తి చేయాలని వివరాలు తెలియజేస్తూ సూచించారు.పార్ట్ 1: 2002లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వివరాలు,పార్ట్ 2: తల్లి లేదా తండ్రి వివరాలు,పార్ట్ 3: ప్రస్తుత నివాస వివరాలు ఫారమ్‌పై ఫోటోను అంటించాలని తెలిపారు. పూర్తి చేసిన ఫారమ్‌లను స్వయంగా అందజేయడానికి జూలై 7, 8. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6 లో సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కు వివరాలను సరిచూసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన ఎంఆర్పీఎస్ నాయకులు



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలో ఎంఆర్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎంఆర్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ మాదిగ సూచనలతో ఈ కార్యక్రమం జరిగింది.మండల నూతన అధ్యక్షుడు కొంగరి ప్రకాష్ మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మంద కృష్ణ మాదిగ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడుతున్న ఉద్యమ నాయకుడని కొనియాడారు.ఆయన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో అణగారిన వర్గాల ఐక్యతే అభివృద్ధికి మార్గం

- మూడు దశాబ్దాల మహాపోరాటానికి విజయపతాకం
- ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ జెండా పండుగ
- మందకృష్ణ మాదిగ త్యాగాలకు న్యాయం చేసిన చరిత్ర
- సామాజిక సమానత్వమే అంతిమ లక్ష్యం
- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ
- ఎస్సీ 59 ఉపకులాలకు సమన్యాయ పోరాటానికి న్యాయబద్ధమైన గుర్తింపు
- సామాజిక న్యాయం కోసం ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపు



**ఖమ్మం ప్రతినిధి, జూలై 07(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగ స్ఫూర్తితో అణగారిన వర్గాల ఐక్యతే అభివృద్ధికి మార్గం అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి అన్నారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) విజయవంతంగా 32 సంవత్సరాలు పూర్తి చేసుకుని 33వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఖమ్మం నగరంలోని రామన్నపేటలో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ జెండా పండుగ ఉద్యమ చరిత్రను మరోసారి సజీవంగా ఆవిష్కరించింది. నీలి జెండా రెపరెపల మధ్య సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజ్యాంగ పరిరక్షణ నినాదాలు మారుమోగాయి.ఆరెంపల అంబేద్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్పీవీ) వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఒక వ్యక్తి సంకల్పం కోట్లాది అణగారిన ప్రజల ఆశయంగా మారిన అరుదైన ఉద్యమమే ఎమ్మార్పీఎస్ అని కొనియాడారు.మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలకు పైగా సాగిన ఉద్యమం కేవలం రిజర్వేషన్ల కోసం చేసిన పోరాటం మాత్రమే కాదని, శతాబ్దాలుగా వివక్షకు గురైన ఎస్సీ సమాజంలోని 59 ఉపకులాలకు రాజ్యాంగబద్ధమైన సమన్యాయం సాధించాలనే మహోద్యమం అని పేర్కొన్నారు. ఆమరణ నిరాహార దీక్షలు, పాదయాత్రలు, రథయాత్రలు, ప్రజా ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకో లు, నిర్భంద ఉద్యమాలు, అరెస్టులు, కేసులు, అనేక త్యాగాలతో సాగిన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వ స్ఫూర్తికి అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్ల ప్రయోజనాలు అందాలనే డిమాండ్‌కు న్యాయపరమైన బలం లభించడం ఉద్యమ విజయానికి నిదర్శనమని, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించడం సామాజిక న్యాయానికి దక్కిన గొప్ప విజయమని సయ్యద్ సాదిక్ అలీ పేర్కొన్నారు. 32 సంవత్సరాల క్రితం వరకు అరుంధతీదేవి బిడ్డల జీవితాలు వివక్ష, అవమానాలు, అణచివేతలతో నిండిపోయాయని, అలాంటి పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగ తన కులాన్ని గర్వకారణంగా మలుచుకుని ఆత్మగౌరవ జెండాను ఎగురవేశారని అన్నారు. ఒక ఉద్యమాన్ని మూడు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా ముందుకు నడిపించడం అసాధారణ నాయకత్వానికి నిదర్శనమని ప్రశంసించారు.బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే అణగారిన వర్గాలకు ఆశాకిరణమని, ఆ రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. సామాజిక సమానత్వం సాధించాలంటే ఎస్సీలు, బీసీలు, మైనారిటీలు పరస్పర ఐక్యతతో ముందుకు సాగాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ఉద్యమాల అసలు లక్ష్యంగా ఉండాలని సూచించారు. రామన్నపేటలో అంబేద్కర్ యువజన సంఘం, కృష్ణమాదిగ దండోరా, అనుబంధ సంఘాలు ప్రజా చైతన్యానికి వేదికలుగా నిలవాలని, యువత ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోజెడ్ల సూర్యం, గుత్తా నరేష్, షేక్ జానిమియా, పెంటు సాహెబ్, పీట్ల కృష్ణమూర్తి, మరికంటి శేఖర్, కీసరి నాగరాజు, మట్టే నాగేష్, దోసపాటి శ్రీను, ఆరెంపల అశోక్, కొండపల్లి సర్వయ్య, సంజీవరావు, మహేష్, గోపి, ఉప్పలయ్య, కరెంట్ అశోక్, ఉమారాణి, లక్ష్మి, మాజీ ఎంపీటీసీ దోసపాటి సృజనతో పాటు గ్రామ పెద్దలు, యువత, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు అందించాలి

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనాలకోట రామారావు**



**ఖమ్మం ప్రతినిధి,జులై 07 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనాలకోట రామారావు అన్నారు.ఖమ్మం నగరంలోని బాలాజీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా దినోత్సవ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. "పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు అందించడం, అలాగే ఆరు నెలల వయస్సు పూర్తయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం" గురించి ఆశా కార్యకర్తలకు వివరించారు.నవజాత శిశువుకు తల్లి ముర్రుపాలు మొదటి టీకా వంటివని, అవి శిశువుకు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని, వివిధ వ్యాధుల బారిన పడకుండా రక్షణ కలుగుతుందని చెప్పారు. ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలోని గర్భిణీలు, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులకు ఈ విషయంపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి శిశువుకు ఈ సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు.అదేవిదంగా ఈ నెల 13న నిర్వహించనున్న 'జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని' విజయవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి మంగళ వారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు.అదేవిధంగా ప్రతి గర్భిణీని గర్భధారణ మొదటి మూడు నెలలలోపే వంద శాతం నమోదు చేయాలని, గర్భిణీలకు అవసరమైన ఆరోగ్య సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు చేపడుతున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ, అర్హులైన ప్రతి వ్యక్తికి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సునంద, సెకండ్ ఏఎన్ఎం శ్రావణి, ఆశలు పాల్గొన్నారు

# వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలకు భారీగా తరలిరావాలి

- రేపు ఉదయం 10 గంటలకు కల్లూరు మెయిన్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం
- మండల అధ్యక్షులు పోట్రూ అర్జున్ రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు షేక్ ఉస్మాన్



**కల్లూరు, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని నేడు బుధవారం ఉదయం 10 గంటలకు కల్లూరు మెయిన్ సెంటర్‌లోని సౌమ్య మెడికల్ షాప్ సమీపంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు పోట్రూ అర్జున్ రావు, కల్లూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు షూస్ టై బెల్ట్ వితరణ

- పంపిణీ చేసిన సన్ రైజ్ అభ్యుదయ సేవాసమితి



**కల్లూరు, జులై 07 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల పై నమ్మకాన్ని కలిగిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలనే సంకల్పంతో విద్యార్థులకు షూస్, టై, బెల్ట్ అందిస్తున్నట్లు సన్ రైజ్ సంస్థ వ్యవస్థాపకులు అధ్యక్షులు మాలతి దాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామపంచాయతీ నందు గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 41మంది విద్యార్థులకు షూస్, బెల్ట్, టై అందించారు. సుమారు పదిహేను వేల రూపాయల విలువైన వస్తువులను ఖమ్మం జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు తండ్రి ఏనుగు రాఘవయ్య వర్ధంతి సందర్భంగా సన్ రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారికి అందించారని వారి సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ ఏనుగు సురేష్ బాబు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. అడిగిన వెంటనే స్పందించి పిల్లలకు షూస్, బెల్టు, టై అందించిన బిజెపి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందించిన వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఏనుగు కిరణ్ బాబు, శోభన్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన దండోరా జెండా రెపరెపలు

**- ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ**



**తల్లాడ, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల కేంద్రం లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ తల్లాడ మండల అధ్యక్షులు ఎక్కిరాల నాగేశ్వరరావు మాదిగల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఆకలి కడుపులు అక్షరాలు తెలియని జీవితాల నుండి ఉద్భవించిన దండోరా లక్ష్యాన్ని సాధించుకునే మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో నిరంతరం పోరాటాలకు సిద్ధమవుతుందని అన్నారు. వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా ప్రతి మాదిగ తల్లిదండ్రులు తమ బిడ్డలను బడికి పంపి ఉన్నత విద్యలో నేర్చుకోవడానికి తమ పిల్లలను గొప్ప చదివించాలని కోరారి. గోటు విలేజ్ కార్యక్రమం ద్వారా గత 40 రోజులుగా పల్లెలను చైతన్యం చేస్తూ మాదిగ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపటానికి చదువు ఆవశ్యకత చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలను బడికి సిద్ధం చేస్తున్నారు. ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ దండోరా జెండాను పల్లె పల్లెను ఎగర వేసుకొని కృష్ణమాదిగ నింపిన ఆత్మవిశ్వాసాన్ని గుండెల్లో చాటుకుని మాదిగ అణగారిన వర్గాల ప్రజల హక్కుల ఆత్మ గౌరవం కోసం రాజ్యాధికారం కోసం మందకృష్ణ మాదిగ నడిపే పోరాటంలో యావత్ మాదిగ జాతి రాజకీయాల కతీతంగా కృష్ణమాదిగ వెంట నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మండల ఇంచార్జ్ కోట బలరాం మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎక్కిరాల నాగేశ్వరరావు, ఎక్కిరాల నాగరాజు, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాగంటి వెంకటి విహెచ్పిఎస్ ఖమ్మం జిల్లా నాయకులు, ఆదూరి సుధాకర్ ఎమ్మార్పీఎస్ తల్లాడ మండలం అధికార ప్రతినిధి, ఆదూరి రవి, వీరయ్య, సంఘసాని హరి మరియు ముఖ్య నాయకత్వం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు





## 95 బస్సుల్లో రైతులు, మహిళా సంఘాల సభ్యుల తరలింపుపై ఎంపీడీవో చంద్రశేఖర్ దిశానిర్దేశం

**కల్లూరు, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్ అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యమంత్రి హాజరుకానున్న సభకు కల్లూరు మండలం నుంచి రైతులు, మహిళా సంఘాల సభ్యులను సురక్షితంగా, క్రమబద్ధంగా తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం మండలానికి మొత్తం 95 బస్సులు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రతి బస్సులో 50 మంది చొప్పున మాత్రమే ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల వివరాలను ముందుగానే నమోదు చేసి, నిర్ణీత సమయానికి బస్సులు బయలుదేరేలా చూడాలని, రైతులు, మహిళా సంఘాల సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. రాకపోకల సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి బస్సుకు బాధ్యులను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించి, సభ నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ఎంపీడబ్ల్యూ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి రూప, ఏపీఎంలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

# సింగరేణి అధికారుల రిలే దీక్షలు 9వ రోజుకు

- పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిల విడుదలకు డిమాండ్
- స్పందించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరిక




**సత్తుపల్లి, జూలై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి ఏరియాలోని సింగరేణి జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయం ఎదుట సింగరేణి శాఖ సత్తుపల్లి ఏరియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరుకున్నాయి. అధికారులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అధికారులు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. పే అప్‌గ్రేడేషన్ పీఆర్‌పీ మా హక్కు అనే నినాదాలతో అధికారులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. వేతన సవరణ పే అప్‌గ్రేడేషన్ ను తక్షణమే అమలు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. 9వ రోజు దీక్షలో డిప్యూటీ ఎస్ఈ ఓసీపీ వీరప్రసాద్, డిప్యూటీ ఎస్ఈ జేవీఆర్ ఓసీపీ పి గోపి, డిప్యూటీ ఎస్ఈ జేవీఆర్ ఓసీపీ వెంకటేష్, ఈఈ జేవీఆర్ సీహెచ్‌పీ రవి పాల్గొని నిరాహార దీక్ష నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అధికారుల న్యాయమైన డిమాండ్లపై సింగరేణి యాజమా న్యం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంస్థలో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, వేతన సవరణతో పాటు పీఆర్‌పీ బకాయిలను చెల్లించాలని కోరారు. సంస్థ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి, పారిశ్రామిక శాంతి దృష్ట్యా యాజమాన్యం ఆలస్యం చేయకుండా చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల ని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నారని, వారి న్యా య మైన హక్కులను పరిరక్షించడం యాజమాన్యం బాధ్యత అని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు





**కల్లూరు, జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మాదిగ జాతి ముద్దుబిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా 1994 ఈదుముడి గ్రామంలో పదిమంది మాదిగ బిడ్డలతో ఏర్పాటైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ వేడుకలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ జయంతిని మున్సిపాలిటీ పరిధి శాంతినగర్లో టౌన్ అధ్యక్షులు ఆదూరు కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగ జాతి అభ్యున్నతికి, విద్యా, ఉద్యోగశీలలో జరుగుతున్న అసమానతులను రూపు మాపేందుకు 32 సంవత్సరాల క్రితం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని వర్గీకరణ సాధించిన విధానాన్ని తెలియజేశారు. కేవలం ఒక మాదిగ జాతి కోసమే కాకుండా, సమాజంలో ఏ వర్గాన్నికైన అన్యాయం జరిగితే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేసిన మహానీయుడని కొనియాడారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణ సాధించి, ఎస్సీ సామాజివర్గంలో 59 కులాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయంగా సమాన హక్కులను సాధించిన మహానీయుడని అన్నారు. ఆరోగ్యశ్రీ అమలు చేయడంలో, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ల పెంపుదలకు కృషి చేశారని, సామాజిక సేవలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుండి పద్మశ్రీ అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లగట్ల కోటేశ్వరరావు, నల్లగట్ల వేణు, కొరకొప్పు ప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పరిగడుపు రాము, ఖమ్మంపాటి పుల్లారావు, ఖమ్మంపాటి వీరస్వామి, బాబూరావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరావు, రమేష్, ప్రకాష్, నాగేశ్వరరావు, యంగల పెంటయ్య, కొత్తపల్లి వీరేంద్ర, తేళ్ళూరి భాస్కర్ రావు, బొల్లిపోగు కృష్ణ, సురేష్, రామకృష్ణ, లక్ష్మణ్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.70 కోట్ల స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధులతో కరీంనగర్ అభివృద్ధికి నూతన అధ్యాయం

- ప్రజల చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం మేయర్ కొలగాని శ్రీనివాస్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు



**కరీంనగర్ టౌన్ జూలై 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరాన్ని ఆధునిక, సుందర, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధుల కింద రూ. 70 కోట్లతో పలు ప్రతిష్ఠాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల మంజూరుకు విశేష కృషి చేసి నగర అభివృద్ధికి అండగా నిలిచిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి నగర ప్రజల తరఫున, నగరపాలక సంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న వరదలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ కొరత, విద్యుత్ వ్యయం, రహదారులు, ప్రజా మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించామని తెలిపారు. ఇప్పటికే అన్ని పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ సిద్ధమవుతున్నాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను వేగంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. **చేపట్టనున్న ప్రధాన అభివృద్ధి పనులు** – రామ్‌నగర్, =ుజవర్క్‌షాప్ మరియు మంచిర్యాల చౌరస్తా వరద నివారణకు ఆధునిక హైడ్రాలిక్ డ్రైనేజీ వ్యవస్థ రూ. 21.50 కోట్లు– టవర్ సర్కిల్‌లో మల్టీ లెవెల్ హైడ్రాలిక్ పార్కింగ్ నిర్మాణం రూ. 25.00 కోట్లు– మున్సిపల్ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు రూ. 2.00 కోట్లు– సదాశివపల్లి జంక్షన్ ఆధునీకరణ రూ. 3.00 కోట్లు– ఎకో–ఫ్రెండ్లీ స్పాంజ్ పార్క్ అభివృద్ధి రూ. 3.00 కోట్లు– వల్లంపాహాడ్ మోడల్ వైకుంఠధామం నిర్మాణం రూ. 2.50 కోట్లు– అల్కాపురి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం రూ. 1.00 కోటి– యానిమల్ బర్త్ కంట్రోల్ & జంతు సంక్షేమ కేంద్రం ఏర్పాటు రూ. 2.00 కోట్లు– కేఆర్ కాలనీ నుండి వల్లంపాహాడ్ బ్రిడ్జ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు రూ. 2.00 కోట్లు– సర్వేలు, డిజైన్‌లు, ఞూ=ల తయారీ కోసం కన్సల్టెన్సీ సేవలు రూ. 1.50 కోట్లు"ప్రజల అవసరాలే మా ప్రాధాన్యత. నాణ్యతలో రాజీ లేకుండా, పూర్తి పారదర్శకతతో, నిర్ణీత గడువులో ఈ పనులను పూర్తి చేసి కరీంనగర్‌ను రాష్ట్రం లోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం. ఈ నగర అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా అందరూ భాగస్వాములు కావాలి" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఎస్ఎస్ ఫౌండేషన్ సేవలు



## ఆనంద ఆశ్రమంలో ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు, భోజనం పంపిణీ

## ఆపన్నులకు అండగా ఎస్ఎస్ ఫౌండేషన్.. సేవాభావంతో ఆకట్టుకున్న పండ్లు, అన్నదాన కార్యక్రమం





**హనుమకొండ ప్రతినిధి,జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో ఆపన్నులకు అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, అనాథలకు ఆత్మీయతను పంచడం నిజమైన సామాజిక సేవకు నిదర్శనమని మరోసారి ఎస్ఎస్ ఫౌండేషన్ చాటిచెప్పింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ బాలసముద్రం రోడ్డులోని ఆనంద ఆశ్రమ బాలికల వసతి గృహంలో పండ్లు, పోషకాహారంతో కూడిన భోజనాన్ని పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకుంది. ఈ సేవా కార్యక్రమం ఆశ్రమంలోని బాలికల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తిని కలిగించింది. ఈ సందర్భంగా వసతి గృహ పర్యవేక్షణ అధికారి సరిత మాట్లాడుతూ.. ఆశ్రమంలోని బాలికలను తమ కుటుంబ సభ్యుల్లా భావించి ఎస్ఎస్ ఫౌండేషన్ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అనాథలు, నిరుపేదల జీవితాల్లో చిన్న సహాయం కూడా పెద్ద మార్పును తీసుకురాగలదని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవీయ విలువలను బలోపేతం చేయడమే కాకుండా, అవసరంలో ఉన్నవారికి భరోసాను కల్పిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ ఇదే సేవాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గురుమిళ్ళ రాజు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సేవ అనేది కేవలం ఆర్థిక సహాయం చేయడం మాత్రమే కాదని, అవసరమైన సమయంలో చేయూత ఇవ్వడం, ఆప్యాయత పంచడం, మనిషికి మనిషి తోడుగా నిలవడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, నిరుపేదలకు అవసరమైన సహాయ కార్యక్రమాలు వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించేందుకు ఎస్ఎస్ ఫౌండేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర ప్రత్యేక సందర్భాలను వృథా ఖర్చులతో కాకుండా అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జరుపుకుంటే మరెందరికో ఉపయోగపడుతుందని సూచించారు. సమాజంలో సేవాభావం పెరిగితేనే సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వం మరింత బలపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని బాలికలు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేయగా, స్థానికులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచే ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని స్వచ్ఛంద సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ పర్యవేక్షణ అధికారి సరిత, ఎస్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణవేణి, వ్యవస్థాపక అధ్యక్షురాలు ధార శంకరమ్మ, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గురుమిళ్ళ రాజు, కార్యవర్గ సభ్యులు రొంటాల కుమార్, మహమ్మద్ స్టాలిన్, శ్రీరాముల రాములు, జట్టి జయపాల్, ఇందిర, జగదీశ్వర్, మస్కే సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీజీపీ సివి.ఆనంద్

- వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెంట్ల పంపిణీ
- కమ్యూనిటీ పోలిసింగ్ సీసీ కెమెరాలను వర్చువల్ గా ప్రారంభం






**ఖమ్మం ప్రతినిధి,జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలలో, విద్యార్థులు, వాహనదారులలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని' తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. వీటి ద్వారా ప్రాక్టికల్ డెమోలు, సైన్ బోర్డుల గుర్తింపు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని ఈ సందర్బంగా వివరిస్తూ. పలువురు వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా నేలకొండపల్లి మండల ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 253 సిసి కెమెరాలను పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి వర్చువల్ గా డీజీపీ ప్రారభించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

# 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్ టెక్నాలజీ' దిశగా తెలంగాణ పోలీస్

**- బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలి**

**- సమీక్ష సమావేశంలో డీజీపీ సివి. ఆనంద్**






**ఖమ్మం ప్రతినిధి,జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ - యూజింగ్ టెక్నాలజీ' అనే లక్ష్యంతో పోలీస్ అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటన లో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్పి కాన్ఫిరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలిసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ...పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి..ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు.బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలన్నారుచట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని,లిస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జజుచీూ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకు గాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలలను కట్టడికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. "మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ఛాలెంజ్ గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారిందని, నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారని, ఇది పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఇందులో విద్యావంతులు ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి అని డీజీపీ స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు."అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గయని అన్నారు. రోడ్డు భద్రత కోసం ఈగల్ తరహాలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల ధోరణులను, వాటిలో ఉన్న లోపాలను డీజీపీ సమగ్రంగా విశ్లేషించి, దర్యాప్తు నాణ్యత, సత్వర విచారణ, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపుదల ద్వారా మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు. సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు,ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**● ఖమ్మం కమిషనరేట్ పోలీసుల విధులు అభినందనీయం ● ఖమ్మం సీపీ సునీల్ దత్ కు అభినందనలు ● పోలీస్ అధికారులు సాయంత్రం అందుబాటులో ఉండి ఫిర్యాదుదారుల సమస్యలకు పరిష్కారం చూపాలి ● ఖమ్మంలో మీడియా సమావేశంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**




**ఖమ్మం ప్రతినిధి,జులై 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :**నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. ఖమ్మం జిల్లా పరిరక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ జిల్లాలో పర్యటించి, గత 3 సంవత్సరాల 'నేర సమీక్ష'(క్రైమ్ రివ్యూ)పై ఎస్ఐ, ఎస్ హెచ్ఓ నుండి పై అధికారులతో జరిగిన సమావేశం అనంతరం ఖమ్మం నగరం సారథి నగర్ లోని పోలీస్ కమిషనర్ పాత క్యాంప్ కార్యాలయం, ఎస్పీ కాన్ఫిరెన్స్ హాల్లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర డీజిపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, 2 నెలల కాలంలో ఎస్ఐ నుండి ఆపై 6500 మంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ రివ్యూ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు పోలీస్ అధికారుల నుండి ఏమి ఆశిస్తారో అటువంటి చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా నేరధర్యాప్తు, నిరంతర ఫాలోప్, నేరస్తులను అరెస్ట్ చేయడమే కాకుండా కోర్టులో అటెండెన్స్, సాక్షులు చివరకు ఫలితం వచ్చే వరకు ప్రయత్నం చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానమును వాడుకోవడంలో తెలంగాణ పోలీస్ ఎప్పుడు ముందుంటుందన్నారు. ఖమ్మంలో ఎన్ఫోర్స్మెంట్, నార్కోటెక్, మారక ద్రవ్యాలు బాగా జరుగుతుందని తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. స్మగ్లర్స్, గంజాయి తయారీదారులు, వాడేవారు ప్రతి ఇంట్లో దూరుతున్నారని, వీటిని అరికట్టడానికి పోలీస్ తో పాటు ప్రజలు, మీడియా, సోషల్ మీడియా కూడా యుద్ధంలాగా పనిచేయాలన్నారు. ఖమ్మం చుట్టుపక్కల గంజాయి తయారుచేసి ట్రాన్స్పోర్ట్ చేయడం, విక్రయించడం జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దుల నుండి జిల్లాలు భద్రాద్రి, ములుగు, భూపాల్ పల్లి, ఆదిలాబాద్ నుండి రాకుండా ఆపగలగాలన్నారు. అయినప్పటికీ తప్పులు చేస్తే వారిపై పిడి యాక్ట్ తో పాటు గట్టి చర్యలు తప్పమన్నారు. ఖమ్మంలో పోలీసులు బాగా పనిచేస్తున్నారన్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాపర్టీ క్రైమ్ కంట్రోల్ లో ఉందని, కేసులు బాగా తగ్గాయని, పోలీసులు డే అండ్ నైట్ గస్తీ ఏర్పాటు, ప్రత్యేక చెకింగ్ చేపట్టాలని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర నియంత్రణ తగ్గిందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరిగాయని ప్రమాద స్థలాలు తెలుసుకొని ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఖమ్మం కమిషనరేట్ పోలీసుల విధులు భేష్ అని అన్నారు. కమీషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. మీడి యా సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వం పై విమర్శలు చేయడం పద్ధతి కాదు

**● కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముగిరాల మధు వంశీకృష్ణ**



**చిట్యాల జులై 7(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించి రైతులకు అండగా ఉన్నాం మొక్కజొన్న రైతులకు అన్యాయం జరుగుతే పూర్తి బాధ్యత నాదేనని ఎమ్మెల్యే భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చెప్పినప్పటికీ ఏమీ దోచని పరిస్థితిలో ప్రభుత్వాన్ని అబసుపాలు చేయడానికి మూడు మండలాల నాయకులతో. దళారులతో మాజీ ఎమ్మెల్యే చేసిన ధర్నా సిగ్గుచేటని పది సంవత్సరాలు అధికారంలో ఉండి దొంగే దొంగ అన్నట్టు ఇసుక మాఫియా బొగ్గు మాఫియా పేదల భూములను ఆక్రమించి నువ్వు చేసినటువంటి దుర్మార్గమైనటువంటి పాలన ప్రజల గమనించారని అందుకే కర్రు కాల్చి వాత పెట్టారని మా భూపాలపల్లి ఎమ్మెల్యే సత్తన్న మచ్చలేని మనిషి తెల్లటి కాగితం అని ఎమ్మెల్యే పై చిల్లర మాటలు మానుకొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం పద్ధతి కాదని హెచ్చరిస్తూ కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతి. నీటిని ఎర్రవెల్లికి మెదక్ సిద్దిపేటకు సిరిసిల్లకు తీసుకుపోయి గత పాలకుల ఫామ్ హౌస్లో పచ్చని పంట పొలాలు పండించుకున్నప్పటికీ ఏమీ మాట్లాడలేని నువ్వు భూపాలపల్లి నియోజకవర్గానికి చుక్క నీరైనా ఇచ్చారని వారు గుర్తు చేశారు మొక్కజొన్న కొనుగోలులో రైతులకు ఏలాంటి అన్యాయం జరిగిన పూర్తి బాధ్యత వహిస్తూ వారికి న్యాయం చేస్తామని వారు అన్నారు

# ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి..!

**జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్**



**షాద్ నగర్, జులై 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖరప్ప మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డ హక్కు. దానిని వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధానాలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నా యనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయని, ప్రతి విద్యా సంవత్సరంలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై భారీ ఆర్థిక భారం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు వంటి వివిధ పేర్లతో అదనపు రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, అంతేకాకుండా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్, బెల్ట్, టై వంటి వస్తువులను విద్యాసంస్థల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే ఈ తరహా వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యార్థులు తప్పనిసరిగా నిర్దిష్ట దుకాణాలు లేదా పాఠశాలల నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని చంద్రశేఖరప్ప డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవా లని, అలాగే ఫీజుల నియంత్రణకు పారదర్శక వ్యవస్థను అమలు చేసి, ప్రతి విద్యార్థికి అందుబాటులో విద్యను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

# పాలమూరుపై కరీంనగర్ విజయం


కరీంనగర్ డైమండ్స్ తెలంగాణ టీ20 (టీజీ20) లీగ్-2026 తొలి సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. తప్పక గెలవాల్సిన కీలక మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్‌పై 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టాప్-4లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన కరీంనగర్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టాస్ గెలిచిన పాలమూరు స్ట్రైకర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన కరీంనగర్ డైమండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టు కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ మరోసారి అసాధారణ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు భారీ స్కోరు అందించాడు. కేవలం 58 బంతుల్లో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లతో 109 పరుగులు చేసి ఈ సీజన్‌లో తన రెండో శతకాన్ని నమోదు చేశాడు. తన్మయ్‌కు ఓపెనర్ సాత్విక్ రెడ్డి మంచి సహకారం అందించాడు. 22 బంతుల్లో 32 పరుగులు చేసి జట్టుకు వేగవంతమైన ఆరంభం ఇచ్చాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో నిశాంత్ రెడ్డి బౌలింగ్‌లో వరుసగా ఐదు ఫోర్లు బాదడం విశేషం. అనంతరం చందన్ సహాని 16 పరుగులు, హెచ్‌కే సింహ 15 పరుగులు, రాహుల్ రాదేశ్ 10 పరుగులు చేశారు. చివర్లో నారాయణ తేజ ఎనిమిది బంతుల్లోనే 23 పరుగులతో మెరుపులు మెరిపించి స్కోరును 216కు చేర్చాడు. పాలమూరు బౌలర్లలో అశ్వద్ రాజీవ్ రెండు వికెట్లు పడగొట్టగా, రిషభ్ బిస్లాస్, మహ్మద్ అఫ్రిది, నిశాంత్ రెడ్డి తలో వికెట్



సాధించారు. 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు స్ట్రైకర్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. కరీంనగర్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమవడంతో పాలమూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 143 పరుగులకే పరిమితమైంది. ఒకవైపు వికెట్లు పడుతున్నా సంహిత్ రెడ్డి మాత్రం చివరి వరకు పోరాడాడు. అతడు అజేయంగా 67 పరుగులు చేసినా జట్టును విజయానికి చేర్చలేకపోయాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో పాలమూరు భారీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కరీంనగర్ బౌలింగ్‌లో రత్లావత్ దినేశ్, శుభం శర్మ చెరో మూడు వికెట్లు తీసి పాలమూరు బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. నారాయణ తేజ, ఆశిష్ శ్రీవాస్తవ్ తలో వికెట్ సాధించి విజయాన్ని మరింత సులభం చేశారు. ఈ విజయంతో కరీంనగర్ డైమండ్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. లీగ్ దశలో చివరి మ్యాచ్‌ను విజయంతో ముగించిన జట్టు నాకౌట్ పోరుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతోంది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ అద్భుత ఫామ్, బౌలర్ల సమష్టి ప్రదర్శన కరీంనగర్‌కు ప్రధాన బలంగా మారాయి. ఇప్పటికే హైదరాబాద్ ఈ-చాంపియన్స్ ఏడింట ఏడూ విజయాలతో 14 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకుంది. ఖమ్మం ఏసెస్ కూడా ఐదు విజయాలతో నాకౌట్ దశకు చేరింది. కరీంనగర్ విజయంతో మరో ప్లే ఆఫ్స్ స్థానం ఖరారవగా, చివరి బెర్తు కోసం మిగిలిన జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించిన కరీంనగర్ డైమండ్స్, తొలి టీజీ20 సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించి టైటిల్ రేసులో బలమైన పోటీదారుగా నిలిచింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ శతకం, బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# సంజు శాంసన్‌ను పక్కన పెట్టేసిన సెలెక్టర్లు

- మళ్లీ అదే తప్పు చేస్తున్నారని మహ్మద్ కైఫ్ ఆగ్రహం



టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత జట్టు వరుస వైఫల్యాలతో గెలుపు రుచి చూడలేకపోతోంది. ఐర్లాండ్‌తో సిరీస్ ఓటమి, ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్ రద్దు కాగా, రెండో టీ20లోనూ టీమిండియా 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ క్రమంలో, ఐర్లాండ్ పర్యటన నుంచి పేలవ ప్రదర్శన కనబరుస్తున్న స్టార్ ఓపెనర్ సంజు శాంసన్‌ను రెండో టీ20తో పాటు త్వరలో జరగబోయే జింబాబ్వే పర్యటన నుంచి కూడా తప్పించడం అభిమానుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. శాంసన్ స్థానంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి జట్టులో అవకాశం కల్పించారు. సంజు శాంసన్ తొలగింపుపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ స్పందిస్తూ సెలెక్టర్ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత టీ20 ప్రపంచ కప్‌లో చేసిన తప్పునే మేనేజ్‌మెంట్ మళ్లీ పునరావృతం చేస్తోందని విమర్శించాడు. టాపార్డర్‌లో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ ఎడమచేతి వాటం బ్యాటర్లే కావడం వల్ల ప్రత్యర్థులు ఆఫ్ స్పిన్నర్లను దించి వికెట్లు తీసే ప్రమాదం ఉందన్నాడు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా టాపార్డర్‌లో తప్పనిసరిగా రైట్, లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ ఉండాలని, శాంసన్ వంటి అనుభవజ్ఞుడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలో ఉన్న నేపథ్యంలో, నేడు నాటింగ్‌హామ్ వేదికగా జరగనున్న మూడో టీ20లో విజయం సాధించి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. అరంగేట్రం మ్యాచ్‌లో 14 పరుగులకే ఔటైన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈ కీలక మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# మూడు ఓటములకే ఇంతలా విమర్శలా..?

**- టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్**

టీ20 ఫార్మాట్‌లో వరల్డ్ ఛాంపియన్ టీమిండియా వరుస పరాజయాలను ఎదుర్కొంటుంది. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన భారత్.. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ శుభారంభం అందుకోలేకపోయింది. వర్షంతో తొలి మ్యాచ్ రద్దవ్వగా.. రెండో టీ20లో ఓటమిపాలైంది. దాంతో భారత జట్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంగళవారం నాటింగ్‌హామ్ వేదికగా మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్.. విమర్శలను తప్పుబట్టాడు. కేవలం మూడు పరాజయాలకే ఇంతాలా విమర్శలు చేయడం సరికాదన్నాడు. ప్రస్తుతం భారత జట్టు ట్రాన్సిషన్ ఫేస్‌లో ఉందని, కొత్త కెప్టెన్, యువ ఆటగాళ్లు



జట్టులోకి వచ్చారని తెలిపాడు. 'గత రెండేళ్లుగా భారత్ టీ20 జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మకపై టోర్నీల్లో విజేతగా నిలిచింది. ఆ విజయాలు సాధించినప్పుడు ఆకాశానికెత్తిన వారే.. ఇప్పుడు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోగానే విమర్శలు చేస్తున్నారు. ఇది సరికాదు. ఆటలో గెలుపోటములు సహజం. భారత జట్టు ప్రస్తుతం పరివర్తనా దశలో ఉంది. జట్టు పునర్నిర్మాణం జరుగుతుంది. జట్టుకు కొత్త కెప్టెన్ వచ్చాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు దూరంగా ఉన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2028 టోర్నీని దృష్టిలో ఉంచుకుని జట్టును నిర్మిస్తున్నాం. ఈ క్రమంలోనే యువ ఆటగాళ్లకు వరుస అవకాశాలు కల్పిస్తున్నాం. ఇలాంటి మార్పుల సమయంలో కొన్ని ఓటములు ఎదురవ్వడం సహజం. హార్దిక్ పాండ్యాకు బ్యాకప్‌గా ఆటగాళ్లను సిద్ధం చేస్తున్నాం. టీ20ల్లో పేస్ ఆల్‌రౌండర్‌ను ఆరో బౌలర్‌గా పరిగణిస్తే వారు కీలక పాత్ర పోషిస్తారు. ఎక్కువ మంది యువ ఆటగాళ్లు ఉన్నప్పుడు 15 మందికీ ఆడే అవకాశం దక్కకపోవచ్చు. కనీసం జట్టుతో పాటు ఉండటం వల్ల వారు ఆ వాతావరణానికి అలవాటు పడుతారు.'అని సితాన్షు కోటక్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా 1-0తో వెనుకంజలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దవ్వగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచింది. ఈ సిరీస్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు కీలకం.


# టీమిండియా హెడ్‌కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్..!

**- జింబాబ్వే టూర్‌కు హెడ్‌కోచ్ మార్పు**

టీమిండియా టీ20 జట్టు త్వరలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందుకోసం భారత సెలక్షన్ కమిటీ.. 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. అయితే ఈ టీమ్‌తో పాటు వెళ్లే కోచింగ్ స్టాఫ్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. జింబాబ్వే పర్యటనకు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్లడం లేదట. గంభీర్ స్థానంలో టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' చీఫ్‌గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు వహించనున్నాడని సమాచారం. భారత క్రికెట్ జట్టు రాబోయే రోజుల్లో వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా ఉండనుంది. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్ 2027కు సన్నద్ధం అవడంలో భాగంగా.. ప్రణాళికలు రచిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో గంభీర్‌కు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. అతడితో పాటు ఇతర కోచింగ్ సిబ్బంది కూడా జింబాబ్వే పర్యటనకు వెళ్లరని సమాచారం. ప్రస్తుతం టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. టీ20 సిరీస్ ఆడుతోంది. ఇది పూర్తయిన తర్వాత వన్డే సిరీస్ ఉంటుంది. ఈ నేపథ్యంలో గంభీర్‌కు విశ్రాంతినిస్తూ, పనిభారాన్ని తగ్గించేందుకు గానూ ఈ పర్యటన బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. జింబాబ్వే పర్యటనతో పాటు ఈ ఏడాది సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ 2026లో కూడా భారత జట్టుకు వీవీఎస్ లక్ష్మణ్ హెడ్‌కోచ్‌గా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే ఏషియన్ గేమ్స్ సమయంలో భారత సీనియర్ జట్టు వెస్టిండీస్‌లో పర్యటిస్తుంది. రెండు సిరీస్‌లు ఒకేసారి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జులై 23, 25, 26 తేదీల్లో భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు ఇదే..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)

# ఫిఫా ప్రపంచ కప్ 2026లో ముగిసిన పోర్చుగల్ కథ

- ప్రీ క్వార్టర్స్‌లో 1-0తో పోర్చుగల్ పై స్పెయిన్ గెలుపు



అమెరికా వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచ కప్ 2026లో పోర్చుగల్ కథ ముగిసింది. ఫుట్‌బాల్ దిగ్గజంగా పేరు పొందిన క్రిస్టియానో రొనాల్డో తన చివరి ప్రపంచ కప్ మ్యాచ్‌ను ఓటమితో ముగించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రీ క్వార్టర్ మ్యాచులో పోర్చుగల్.. 1-0 తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. పోర్చుగల్ మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక 2 దశాబ్దాలకు పైగా తన ఆటతో మంత్రముగ్ధులను చేసిన రొనాల్డో.. తన చివరి మ్యాచ్ ముగిసిన తర్వాత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో.. 2006లో తొలిసారి ఫిఫా వరల్డ్ కప్ ఆడాడు. ఇక ఫిఫా ప్రపంచకప్ 2026 తనకు చివరి టోర్నీ అని రొనాల్డో ఇది వరకే ప్రకటించాడు. కానీ తన జట్టును మరోసారి క్వార్టర్ ఫైనల్‌కు తీసుకెళ్లాలన్న అతడి ఆశలు నెరవేరలేదు. స్పెయిన్ మికెల్ మెరినో చేసిన ఏకైక గోల్ .. స్పెయిన్ విజయాన్ని, పోర్చుగల్ నిష్క్రమణను ఖాయం చేసింది. కాగా స్పెయిన్.. 2010లో ఫిఫా ప్రపంచకప్ టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత ఒక్కసారి కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోలేదు. కానీ 16 ఏళ్ల తర్వాత మళ్లీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌లో బెల్జియంతో తలపడే అవకాశం ఉంది. మరోవైపు ఈ మ్యాచ్‌తో స్పెయిన్ వరుసగా ఆరు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులకు గోల్ చేసే అవకాశమే ఇవ్వకుండా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇటలీ (1990), స్విట్జర్లాండ్ (2006-10) పేరిట ఉన్న ఐదు వరుస క్లీన్ షీట్‌ల రికార్డును ఆ జట్టు అధిగమించింది. గోల్ కీపర్ ఉనై సిమోన్ వ్యక్తిగతంగానూ అరుదైన ఘనత సాధించాడు. వరుసగా 609 నిమిషాల పాటు గోల్ ఇవ్వకుండా నిలిచి ప్రపంచ కప్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఇటలీ దిగ్గజ గోల్ కీపర్ వాల్టర్ జెంగా పేరిట ఉన్న 517 నిమిషాల రికార్డును అతడు బ్రేక్ చేశాడు. ఇక 41 ఏళ్ల రొనాల్డో.. అరుదైన రికార్డు సాధించాడు. ఆరు ప్రపంచకప్‌లు ఆడిన ఇతడు.. అన్నింట్లోనూ గోల్ చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. తాజా టోర్నీలో అతడు మూడు గోల్స్ చేశాడు. ఆరు సార్లు ప్రపంచకప్ ఆడినా.. రొనాల్డో మాత్రం ట్రోఫీ అందుకోలేకపోయాడు. తన డెబ్యూ ప్రపంచకప్ అయిన 2006లో రొనాల్డో జట్టు సెమీస్ వరకూ చేరింది. ఇదే అతడి కెరీర్‌లో బెస్ట్. మొత్తంగా ప్రపంచకప్‌లో అతడు 27 మ్యాచులలో 11 గోల్స్ చేశాడు.

# భారత్‌తో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు ప్రకటన


ఈ నెలలో భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్ తమ జట్టును ప్రకటించింది. 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ఓ కొత్త ఆటగాడికి తొలిసారిగా అవకాశం కల్పించారు. ససెక్స్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్ ను ఈ సిరీస్ కు ఎంపిక చేశారు. టెస్టుల్లో రాణించిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్‌కు కూడా తొలిసారిగా వన్డే జట్టు నుంచి పిలుపు అందింది. మరోవైపు, స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి 50 ఓవర్ల జట్టులోకి రావడం ఇంగ్లండ్‌కు బలాన్నిచ్చింది. 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లండ్ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన జేమ్స్ కోల్స్‌ను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తుండటంతో జట్టులోకి తీసుకున్నారు. అతనితో పాటు లియామ్ డాసన్‌ను కూడా ఎంపిక చేయడం ద్వారా స్పిన్ బౌలింగ్ వనరులను పటిష్టం చేసుకోవాలని ఇంగ్లండ్ భావిస్తోంది. టెస్టుల్లో మంచి ప్రదర్శన కనబర్చినందుకు జోష్ టంగ్‌కు వన్డేల్లో అవకాశం దక్కింది. గాయాల నుంచి కోలుకున్న గస్ అట్కిన్‌సన్, సాకిబ్ మహమూద్ కూడా తిరిగి జట్టులో చేరారు. గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో జోస్ బట్లర్, జో రూట్, బెన్ డకెట్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు, ఈ సిరీస్ కోసం భారత్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఆడనున్నారు. జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుండగా, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.ఇంగ్లండ్ వన్డే జట్టు:హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జో రూట్, విల్ జాక్స్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, శామ్ కరన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, లియామ్



డాసన్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# రాజకీయాల్లోకి ధనుష్? ..

## జెండా ఆవిష్కరించిన అభిమానులు!



తమిళనాడు రాజకీయాల్లో కోలీవుడ్ దళపతి విజయ్ సృష్టించిన సంచలన విజయం... ఇప్పుడు ద్రవిడ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలిసారే ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి, విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. కమల్ హాసన్ వంటి మహామహులకే సాధ్యం కాని ఈ రాజకీయ అద్భుతాన్ని విజయ్ సాకారం చేయడంతో, ఇప్పుడు కోలీవుడ్‌లోని మరికొందరు స్టార్స్ అటువైపు అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా త్వరలోనే రాజకీయ అరంగేట్రం చేయబోతున్నారనే ప్రచారం తమిళనాట జోరుగా సాగుతోంది. తాజాగా ధనుష్ అభిమాన సంఘం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఒక అధికారిక జెండాను ఆవిష్కరించడం హాట్ టాపిక్‌గా మారింది. కేవలం జెండా రూపకల్పనకే పరిమితం కాకుండా, తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని అభిమాన సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. ఇది పక్కా పొలిటికల్ స్కెచ్‌తోనే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి విజయ్ బాటలోనే ధనుష్ కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి పూర్తి ప్రణాళికతో పక్కాగా బరిలోకి దిగుతారని కోలీవుడ్ వర్గాల్లో గట్టి చర్చ నడుస్తోంది. మరోవైపు, తన పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో ఇంత పెద్ద ఎత్తున ఊహాగానాలు వస్తున్నప్పటికీ... హీరో ధనుష్ వైపు నుంచి గానీ, ఆయన పీఆర్ టీమ్ నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.



# నా అండాలు దాచుకున్నా : నటి కృతి సనన్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక కీలకమైన, స్ఫూర్తిదాయకమైన విషయాన్ని వెల్లడించారు. కెరీర్‌లో 'మిమి', 'క్రూ', 'బరేలీ కి బర్ఫీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దూసుకుపోతున్న ఆమె.. పెళ్లి, పిల్లల విషయంలో మహిళలు ఎదుర్కొనే సామాజిక, వయసు సంబంధిత ఒత్తిడిని అధిగమించేందుకు తాను కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను ఫ్రీజ్ (జుస్త్రస్త్ర ఖీతీవవఓఱఅస్త్రు) చేయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా, ఎలాంటి టైమ్‌లైన్ ఒత్తిడి లేకుండా జీవించే స్వేచ్ఛను పొందానని ఆమె పేర్కొన్నారు. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' వ్యవస్థాపకురాలు కరిష్మా మెహతాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో కృతి ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మహిళలు ఎదుర్కొనే 'బయోలాజికల్ క్లాక్' సమస్య గురించి హోస్ట్ ప్రశ్నించగా, కృతి స్పందిస్తూ.. "నిజాయతీగా చెప్పాలంటే, నేను నా అండాలను ఫ్రీజ్ చేయించుకున్నాను. పెళ్లి ఇప్పుడే చేసుకోవాలి, పిల్లల్ని ఇప్పుడే కనాలి అనే ఒత్తిడికి నేను లోనవ్వాలని అనుకోలేదు. వివాహం అయినా, పిల్లలైనా సరే.. మనసులోంచి రావాలి కానీ, ఎవరో చెప్పారని, వయసు అయిపోతోందని కాదు" అని ఆమె స్పష్టం చేశారు. ఈ సదుపాయం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చని, కానీ తాను ఆ ఖర్చు భరించగలిగినందుకు అదృష్టవంతురాలినని ఆమె అన్నారు. ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేశారనే విషయాన్ని కూడా కృతి వివరించారు. జాతీయ అవార్డు సాధించిపెట్టిన 'మిమి' సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరగాల్సి వచ్చింది. ఆ సమయంలోనే తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "ఆ సినిమా కోసం బరువు పెరగడానికి నాకు రెండు నెలల సమయం దొరికింది. షూటింగ్ లేదు. అప్పుడే ఈ ప్రక్రియ గురించి ఒకరు నాకు సలహా ఇచ్చారు. ఇది మహిళలు తమకు తాము ఇచ్చుకునే ఉత్తమ బహుమతి అని చెప్పారు. పైగా 'మిమి' సినిమా సరోగసీ నేపథ్యంతో కూడుకున్నది కావడంతో, ఆ సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సరైనదనిపించింది" అని కృతి గుర్తుచేసుకున్నారు.

# వేగం అందుకున్న వెంకీ-అనిల్ సినిమా..

## సెట్స్‌లోకి వెంకటేశ్

వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కలిసి నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ వేగం అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. దీంట్లో పాల్గొనేందుకు వెంకటేశ్ తాజాగా సెట్స్‌లో అడుగుపెట్టారు.

ప్రస్తుతం ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్లలో వెంకటేశ్‌తో పాటు నందమూరి కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల కల్యాణ్‌రామ్ పుట్టినరోజును చిత్రబృందం సెట్స్‌లోనే జరుపుకొంది. అదే సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, 2027 సంక్రాంతికి సినిమా విడుదల కానుందని ప్రకటించింది.

ఇటీవల ఈ సినిమా పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో నిర్మాతలు హెచ్చరిక జారీ చేశారు. అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రకటనలను మాత్రమే నమ్మాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేశారు.

కొద్ది రోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



వెంకటేశ్‌తో అనిల్ రావిపూడికి ఇది ఐదో సినిమా. ఇప్పటికే 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి విజయాల తర్వాత మరోసారి ఇద్దరూ చేతులు కలిపారు. కల్యాణ్‌రామ్‌తో అనిల్‌కు ఇది రెండో చిత్రం. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'పటాస్' మంచి విజయం సాధించింది.

ఈ చిత్రాన్ని అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే కుటుంబ వినోద కథగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. హాస్యం, భావోద్వేగాలు, వినోదానికి సమాన ప్రాధాన్యం ఉండేలా అనిల్ రావిపూడి తన శైలిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

# ముఖాలు మారినా పద్ధతులు మారలేదు

## : 'అమ్మ'కు రేవతి, పద్మప్రియ రాజీనామా!



మలయాళ సినీ తారల సంఘం 'అమ్మ'లో సంక్షోభం మరింత ముదిరింది. జస్టిస్ హేమా కమిటీ నివేదిక వెలువడిన తర్వాత చెలరేగిన వివాదాల నేపథ్యంలో అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్, ఆయన కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 'అమ్మ'కు తొలి మహిళా అధ్యక్షురాలిగా రికార్డు సృష్టిస్తూ నటి శ్వేతా మీనన్ బాధ్యతలు చేపట్టారు. అయితే, తాజాగా జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమె కమిటీపై కూడా పలు ఆరోపణలు రావడంతో శ్వేతా మీనన్‌తో పాటు మొత్తం కార్యవర్గం మూకుమ్మడిగా రాజీనామా చేసింది. ఈ తీవ్ర అనిశ్చితి మధ్య, పరిశ్రమలోని సీనియర్ నటీమణులు రేవతి, పద్మప్రియ సైతం 'అమ్మ' ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం మలయాళ చిత్రసీమలో సంచలనంగా మారింది. పని ప్రదేశాల్లో మహిళల భద్రత, సమాన వేతనాల కోసం పోరాడుతున్న 'విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' (ఔజజ) వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న రేవతి, పద్మప్రియ ఈ నిర్ణయంపై ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంస్థలో అధికారం చేతులు మారినప్పటికీ ప్రాధాన్యతలు మారలేదని, 'అమ్మ'లో ఇంకా పితృస్వామ్య ధోరణులు, అధికార రాజకీయాల ప్రభావం కొనసాగుతూనే ఉందని వారు ఆరోపించారు. తాము ఎన్నో దశాబ్దాలుగా ఈ రంగానికి సేవ చేశామని, భవిష్యత్తు మెరుగ్గా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మలయాళ సినిమా ఎప్పటికీ తమదేనని, దాని కోసం పనిచేయడానికి ఎలాంటి సంస్థ సభ్యత్వాలు అవసరం లేదని వారు కుండబద్దలు కొట్టారు.

# హీరోల తప్పులను ఎత్తి చూపడం చాలా కష్టం



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, హీరోయిన్ పార్వతి తిరువోతు జంటగా నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఐనోబడీ'. నిస్సాం బషీర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ బ్యాంక్ ఉద్యోగి రాజీవన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మలయాళంలో ఈ నెల 9న, తెలుగులో 10న థియేటర్లలో విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నటి పార్వతి మలయాళ చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై, హీరోల చుట్టూ అలుముకున్న కల్చర్‌పై చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

గడిచిన ఎనిమిది, తొమ్మిదేళ్లలో మలయాళ సినీ పరిశ్రమలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమే అయినా... అవన్నీ మనస్ఫూర్తిగా వచ్చినవి కావని పార్వతి కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల నుంచి వచ్చిన విమర్శలు, మీడియా నిరంతరం చూపించిన శ్రద్ధ వల్లే ఇండస్ట్రీలో ఆ మార్పులు జరిగాయని ఆమె అభిప్రాయపడ్డారు. మలయాళ చిత్రసీమలో స్టార్ హీరోలను పూజించే సంస్కృతి అలాగే కొనసాగుతోందని, ఇక్కడి సూపర్‌స్టార్లను దేవుళ్లలా పూజించడం వల్లే వారి తప్పులను ఎత్తిచూపడం ఎవరికైనా చాలా కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఉండటం వల్లే ఇండస్ట్రీలో బాగా పలుకుబడి ఉన్న వ్యక్తులు, కొత్తగా వచ్చే వారిపై తమ అధికారాన్ని చాలా సులభంగా చెలాయిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పలుకుబడి ఉన్నవారు కొత్తవారి టాలెంట్‌ను తొక్కేస్తూ, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సినిమా రంగంలో సానుకూల మార్పులు చాలా నెమ్మదిగా సాగుతుండటం తనకు ఎంతో నిరాశ కలిగిస్తోందని... అయినప్పటికీ ఇండస్ట్రీలో మహిళల హక్కుల కోసం, పని చేసేందుకు అనువైన మంచి వాతావరణం కోసం తమ మహిళా సంఘం చేస్తున్న పోరాటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేది లేదని పార్వతి స్పష్టం చేశారు.

# యాక్షన్ మోడ్‌లోకి మెగాస్టార్..

## హైదరాబాద్‌లో 'మెగా158' భారీ ఫైట్ సీక్వెన్స్ షురూ



మెగాస్టార్ చిరంజీవి తన 158వ సినిమా కోసం యాక్షన్ మోడ్‌లోకి ప్రవేశించారు. దర్శకుడు బాబీ కొల్లితో ఆయన చేస్తున్న ఈ ప్రాజెక్టులో ఓ భారీ యాక్షన్ ఘట్టం చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న రెండో షెడ్యూల్‌లో భాగంగా ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ సారథ్యంలో ఈ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఈ యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులకు వింటేజ్ చిరంజీవిని గుర్తుకు తెచ్చేలా ఉంటాయని చిత్ర యూనిట్ చెబుతోంది.

'మెగా158' (వర్కింగ్ టైటిల్) రెండో షెడ్యూల్ జూన్ 22న హైదరాబాద్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీనిపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ గతంలోనే ప్రకటన విడుదల చేసింది. "పొల్లాచ్చి అందాల నుంచి మరో భారీ ఘట్టంలోకి అడుగుపెట్టాం. మెగాస్టార్ ప్రతి షాట్‌ను ఓ ఉత్సవంగా మారుస్తున్నారు" అని పేర్కొంది. అంతకుముందు తమిళనాడులోని పొల్లాచ్చిలో తొలి షెడ్యూల్‌ను చిత్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల యువనటి అనస్వరా రాజన్‌ను చిత్ర బృందంలోకి అధికారికంగా స్వాగతించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్' ఫేమ్ విజయ్ కార్తీక్ కణ్ణన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొల్లా అవినాశ్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

గత ఏడాది చిరంజీవి పుట్టినరోజున ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోను పంచుకుని అభిమానులను ఉత్సాహపరిచారు. 'ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.